ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY




రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు

5★★★

శనివారం 30 మార్చి 2024

నియంత్రృత్వ పాలనకు చరమగీతం - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ 8

కొనసాగుతున్న శివ కల్యాణోత్సవాలు 7



'ఉపాధి' కూలి పెంపు



- పెరిగిన రూ.28తో రూ.300 చేరిన మొత్తం
- జిల్లాలో 1.98 లక్షల మందికి లబ్ధి
- సమ్మర్ అలవెన్స్‌కు మంగళం
- కూలి పెంపుతో ఊరట
- ఏప్రిల్ 1 నుంచి అమలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

వ్యవసాయ పనులు లేక వలసలు వెళ్లే పరిస్థితుల్లో గ్రామీణులకు ఉన్న ఊర్లోనే ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని తీసుకొచ్చింది. కనీస సౌకర్యాలు లేక మండుటెండలో పనిచేసే కూలీలకు వేసవి సమయంలో ఐదు నెలలపాటు సమ్మర్ అలవెన్స్ అందించే వారు. మూడు సంవత్సరాలుగా సమ్మర్ అలవెన్స్‌కు మంగళం పాడారు. ఈ పరిస్థితుల్లో నిరాశ చెందుతున్న ఉపాధిహామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం తాజాగా రూ.28 కూలి పెంచింది. ఈ కూలిని ఏప్రిల్ 1 నుంచి అందించనుంది. ప్రస్తుతం రూ.272 కూలి లభిస్తుండగా రూ.28తో రూ. 300కి చేరింది. కూలి పెంపుతో రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1.98 లక్షల మంది కూలీలకు లబ్ధి చేకూరనుంది. గత నెల వరకు ఉపాధిహామీ పథకంలో జిల్లాలోని కూలీలు సరాసరి రోజువారీ కూలి రూ.205.51 పొందుతున్నారు. ప్రస్తుతం పెరిగిన కూలి మరికొంత ఊరటను ఇవ్వనుంది. జిల్లాలో ఇప్పటి వరకు 97 వేల జాబ్ కార్డులు జారీ చేయగా 1.98 లక్షల మంది కూలీలు ఉన్నారు. 39 వేల 493 కుటుంబాల్లో 54 వేల 243మందికి ఉపాధి కల్పించారు. 611 మంది వంద రోజుల పనిదినాలను పొందారు. ఎండల్లో పనిభారం తగ్గించడానికి ప్రభుత్వం ఇచ్చే సమ్మర్ అలవెన్స్ కొనసాగిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని కూలీలు భావిస్తున్నారు. ఉపాధిహామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్‌ల కింద ఫిబ్రవరిలో 20 శాతం మార్చిలో 25 శాతం, ఏప్రిల్, మేలో 30 శాతం జూన్‌లో 20 శాతం సమ్మర్ అలవెన్స్‌లు అందించే వారు, రాష్ట్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్ ద్వారా పనుల ప్రకారం సమ్మర్ అలవెన్స్‌లను జమ చేసేవారు. కేంద్ర ప్రభుత్వ సాఫ్ట్‌వేర్‌లో ఆ అవకాశం లేకపోవడంతో కూలీలు నష్టపోతున్నారనే చర్చ జరుగుతోంది. కేంద్రం తెచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్‌తోనే అలవెన్స్ దూరమైందని నిరాశలో కూలీలు ఉన్నారు. దేశంలో వేసవి ప్రభావం వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా ఉండడంతోనే 2022 సంవత్సరం నుంచి దేశమంతా ఒకే విధానం ఉండాలనే భావనతో సమ్మర్ అలవెన్స్ తొలగించినట్లుగా తెలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కోసం వలసలు వెళ్లకుండా నివారించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ పథకం కూలీలకు కొత్త ఎఫ్‌టవేర్ ముందుకు తీసుకొచ్చారు. ప్రతీ వేసవి కాలం సమయంలో ఐదు నెలలపాటు సమ్మర్ అలవెన్స్‌లను అందించేవారు. ఉపాధిహామీలో పారదర్శకత పెంపొందించే దిశగా కేంద్ర, గ్రామీణాభివృద్ధి సంస్థ తన అజమాయిషీలోనే పనుల నిర్వహణకు పూనుకుంది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉపయోగించే టీటీఏ సాఫ్ట్‌వేర్‌ను తొలగించారు. నేషనల్ ఎన్‌ఫార్మెటిక్ సెంటర్ సర్వర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అంతేకాకుండా సాంకేతికతను ఉపయోగిస్తూ పని జరిగే చోటు నుంచే వివరాలను అప్‌లోడ్ చేయడం వంటి విధానాలను ముందుకు తెచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్న కొత్త సాఫ్ట్‌వేర్‌లో సమ్మర్ అలవెన్స్ ఆప్షన్ లేకపోవడంతో వేసవి భత్యాన్ని ఉపాధి హామీ కూలీలు కోల్పోతున్నారు.

లేబర్ బడ్జెట్‌లో 27.55 లక్షల పనిదినాల లక్ష్యం

జిల్లాలో ఉపాధిహామీ పథకంలో 97 వేల జాబ్ కార్డులు ఉండగా కూలీలు 1.98 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనిదినాలు కల్పించడానికి లేబర్ బడ్జెట్‌ను సిద్ధం చేశారు. పనులను గుర్తించి కూలీల బడ్జెట్ రూపకల్పనలో జిల్లాలోని 255 గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించి పనులను గుర్తించారు. గతంలో ఉపాధి పనులు ఇష్టానుసారంగా జరిగిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం పాత విధానానికి స్వస్తి పలికి కొత్త విధానాన్ని ముందుకు తీసుకొచ్చింది. ఉపాధి పనులపై సామాజిక తనిఖీలతో కేంద్రం, పూర్తిగా నిఘా పెంచింది. ఇప్పటికే నేషనల్ ఇన్‌ఫ్మరెటిక్ సెంటర్ ఎన్ఐసీ సర్వర్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధిహామీ కూలీలకు నేరుగా వారి ఖాతాల్లోనే కూలీని నేరుగా జమ చేస్తోంది. 2024-2025 సంవత్సరానికి 27 లక్షల 55 వేల 773 పనిదినాలు కల్పించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఏప్రిల్ మాసంలో 4,06,188 పనిదినాలు కల్పించాలని నిర్ణయించారు. మే నెల వరకు 8,28,737 పనిదినాలు, జూన్ వరకు 1,093,321 పనిదినాలు, జూలై వరకు 12,24,197 పనిదినాలు, ఆగస్టు వరకు 13,38,739 పనిదినాలు, సెప్టెంబరు వరకు 14,48,308 పనిదినాలు, అక్టోబరు వరకు 15,65,972 పనిదినాలు, నవంబరు వరకు 17,06,216 పనిదినాలు, డిసెంబరు వరకు 18,73,535 పనిదినాలు, జనవరి వరకు 20,82,249 పనిదినాలు, ఫిబ్రవరి వరకు 23,73,158 పనిదినాలు, మార్చి వరకు పూర్తిగా 27,55,773 పనిదినాలు లక్ష్యాన్ని పూర్తి చేసే విధంగా యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. బోయినపల్లి మండలంలో 1,62,160 పనిదినాలు, చందుర్తిలో 2,61,201, ఇల్లంతకుంట 2,62,738, గంభీరావుపేట 3,66,711, కోనరావుపేట 3,28,709, ముస్తాబాద్ 2,75,592, రుద్రంగి 68,568, తంగళ్లపల్లిలో 3,20,100, వీర్నపల్లి 2,10,000, వేములవాడ 55,350, వేములవాడ రూరల్ 1,45,700, ఎల్లారెడ్డిపేట 2,98,944 పనిదినాలు కల్పించే లక్ష్యంగా పెట్టుకున్నారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

సిరిసిల్ల క్రైం, మార్చి 29: ఎన్నికల సందర్భంగా సోషల్ మీడియా పోస్టులపై నిఘా పటిష్ఠం చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్వేషకర, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోస్టులు పెట్టేవారిపై చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు, యువత సోషల్ మీడియా విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు నమ్మవద్దని, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు.

సేవలను మరింత విస్తృతం చేస్తాం



మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రాజిరెడ్డి

సిరిసిల్ల రూరల్, మార్చి 29: లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320 జీ సేవ కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 320 జీ 2024 లయన్‌స్టిక్ ఇయర్ నూతనంగా ఎన్నికైన జిల్లా గవర్నర్ ఎన్.వెంకటేశ్వర్‌రావు, ఫస్ట్ వైస్ గవర్నర్ కె.రాములు, సెకండ్ వైస్ గవర్నర్ మోర బద్రేశం మొదటి సారిగా ఎన్నికై సిరిసిల్లకు వచ్చిన సందర్భంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గవర్నర్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ 320 జీ సేవలు దేశంలోనే నాలుగో స్థానంలో ఉందన్నారు. లయన్ గుగ్గిళ్ల జగన్‌గౌడ్, నాగుల సంతోష్‌గౌడ్, అనంతుల శివప్రసాద్, చేపూరి నాగరాజు, శ్రీకాంత్, భానుచందర్, డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, శైలజ, పద్మలత, ప్రమోద పాల్గొన్నారు.

సుద్దాల హమాలీ సంఘం భవన నిర్మాణానికి కృషి

కోనరావుపేట, మార్చి 29 : కోనరావుపేట మండలం సుద్దాల హమాలీ సంఘం భవన నిర్మాణానికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హామీ ఇచ్చారు. శుక్రవారం కార్మికులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను కలిసి హమాలీ సంఘం భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఆయన హామీ ఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. కార్యక్రమంలో హమాలీ సంఘం ప్రెసిడెంట్ జాన్, హమాలీ సంఘం నాయకులతోపాటు కాంగ్రెస్ జిల్లా నాయకులు కచ్చకాయల ఎల్లయ్య గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఎరవెల్లి నాగరాజు, మండల నాయకులు కచ్చకాయల బాల్ రెడ్డి, ఉప్పుల గంగయ్య, బుర్ర రమేష్ తదితరులు ఉన్నారు.

రేపాకకు ఆర్టీసీ బస్సు సర్వీసు పునరుద్ధరించాలి

ఇల్లంతకుంట, మార్చి 29: మండలంలోని రేపాక గ్రామానికి ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని గ్రామస్థులు కోరారు. బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అనేక సంవత్సరాలుగా కరీంనగర్ నుంచి బెజ్జంకి మీదుగా ఇల్లంతకుంటకు ఆర్టీసీ బస్సులు నడిచేవన్నారు. ఇటీవల బస్సులు రద్దు చేయడంతో విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మాజీ ఎంపీటీసీ తోట మధుసూదన్, నాయకులు ఆనందరెడ్డి, సంపత్ రెడ్డి, వెంకటరెడ్డి, బుచ్చిమల్లయ్య, నారాయణ, ముత్యంరెడ్డి పాల్గొన్నారు..

ముదిరాజ్‌లకు పార్టీల ప్రాధాన్యం

ఇల్లంతకుంట, మార్చి 29: రాష్ట్రంలోని ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు ప్రాధాన్యం ఇచ్చాయని మండల అధ్యక్షుడు గొడుగు నర్సయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కొక్క స్థానాన్ని ఇవ్వడంపై అభినందనలు తెలిపారు. మూడు ప్రాంతాలలో ముదిరాజ్ నాయకుల గెలుపుకోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

సిరిసిల్ల నేతన్నలను ఆదుకోవాలి

- రూ.270 కోట్ల బకాయిలు విడుదల చేయాలి
- వర్కర్ టు ఓనర్ పథకాన్ని ప్రారంభించాలి
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ

సిరిసిల్ల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేత కార్మికులను ఆదుకోవాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కోరారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభంతో నాలుగు నెలలుగా కార్మికులు, యజమానులు ఉపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పాత బకాయిలు రూ.270 కోట్లు ఇంతవరకు చెల్లించలేదని, కొత్త ఆర్డర్లు ఇవ్వడం లేదని తెలిపారు. ఫలితంగా వస్త్ర పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన దాదాపు 20 వేల మంది కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారని, అప్పులు చేస్తూ ఆర్థికంగా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించాలని, కొత్త ఆర్డర్లతో వస్త్ర పరిశ్రమను ఆదుకోవాలని 27 రోజులుగా సమ్మెచేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. కచ్చితంగా బతుకమ్మ చీరలను నేయాలని గత ప్రభుత్వం ఆసాములు, యజమానులను ఒత్తిడి చేసిందని, పాత వ్యాపారాలను బంద్ చేయించిందని తెలిపారు. మాస్టర్ వీవర్స్ పేరుతో పెద్ద యజమానులకు బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇచ్చి చిన్న చిన్న యజమానులను ఆసాములుగా, కూలీలుగా మార్చిందని పేర్కొన్నారు. బతుకమ్మ చీరలు ఉత్పత్తి చేసిన యజమానులకు ప్రభుత్వం నుంచి సక్రమంగా బిల్లులు రాకపోవడంతో దాదాపు రూ.270 కోట్లు బకాయిలు పేరుకుపోయాయని, వ్యాపారాలు చేయడానికి డబ్బులు, కొత్త ఆర్డర్లు లేక యజమానులు వస్త్ర పరిశ్రమను బంద్ పెట్టారని తెలిపారు. పరిశ్రమపై ఆధారపడిన కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని, ఆసాములు రిలే నిరాహారదీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. పవర్‌లూం కార్ఖానాలకు 24 సంవత్సరాల నుంచి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్న విద్యుత్‌ను నిలిపివేయడంతో రెట్టింపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయని, బిల్లులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. విద్యుత్ బకాయిలను మాఫీ చేయడంతోపాటు సబ్సిడీని యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్మికులకు ఇవ్వాల్సిన పది శాతం యారన్ సబ్సిడీని వెంటనే అందించాలని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రూ.370 కోట్లతో ప్రవేశపెట్టిన వర్కర్ టు ఓనర్ పథకం అర్ధంతరంగా నిలిచిపోయిందని ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వస్త్ర పరిశ్రమకు రావాల్సిన బకాయిలు విడుదల చేయడంతోపాటు ప్రభుత్వ ఆర్డర్లు ఇవ్వాలని, సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభాన్ని అధిగమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చెక్ పోస్టు వద్ద అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

తంగళ్లపల్లి, మార్చి 29: చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను పకడ్బందీగా తనిఖీ చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని జిల్లా సరహద్దు చెక్ పోస్టును ఎస్పీ అఖిల్ మహాజన్, ట్రైనీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లడుతూ లోక్‌సభ ఎన్నికలలో అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా జిల్లా సరిహద్దుల్లో ఆరు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆధారాలు చూపని నగదు, నగలు ఇతరత్రా సొత్తును సీజ్ చేసి జిల్లా గ్రీవియన్స్ కమిటీకి అప్పగిస్తున్నామన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్లరాదన్నారు. పెద్ద మొత్తంలో నగదు, ఆభరణాలుంటే తప్పనిసారిగా వెంట సంబంధిత పత్రాలు ఉండాలని సూచించారు. తనిఖీలో ఎస్సై సుధాకర్ పాల్గొన్నాడు.

అ'పూర్వ' చైతన్యం

- విద్య నేర్పిన బడికి చేయూత
- రూ.10 లక్షలతో రెండు గదుల నిర్మాణం
- ఆదర్శంగా నిలిచిన పూర్వ విద్యార్థులు



పూర్వవిద్యార్థులు నిర్మించిన అదనపు తరగతి గదులు



తరగతి గదులను ప్రారంభిస్తున్న పూర్వవిద్యార్థులు(ఫైల్)

ఇల్లంతకుంట, మార్చి 29: చదువు నేర్పిన బడికి చేతనైనంత సాయం చేయాలనుకున్నారు. ఉద్యోగ, వ్యాపార రీత్యా వివిధ ప్రాంతాల్లో స్థిర పడినవారు, స్థానికంగా ఉన్నవారు ఒక్కటయ్యారు. చదువుకున్న పాఠశాలలో అదనపు తరగతి గదులు నిర్మించి ఆదర్శంగా నిలిచారు. ఇల్లంతకుంట మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థుల్లో కొంతమందికి పాఠశాలకు తమ వంతుగా ఏదైనా చేయాలనే ఆలోచన వచ్చింది. సోషల్ మీడియా వేదికగా పూర్వ విద్యార్థులను పాఠశాలకు రావాలని కోరారు. ఎనిమిది నెలల క్రితం ఆయా బ్యాచ్‌లకు చెందిన కొంతమంది పూర్వ విద్యార్థులు చదువుల గుడికి చేరుకున్నారు. ఎలాంటి వసతులు కల్పిస్తే బాగుంటుందోనని పరిశీలించారు. అదనపు తరగతి గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని గుర్తించారు. తరగతి గదులు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. పాఠశాలలో ఉన్న పూర్వపు పదోతరగతి రిజస్టర్ల ద్వారా మరికొంత మంది విద్యార్థుల వివరాలు సేకరించారు. ఫోన్ ద్వారా వారిని సంప్రదించడం, ప్రత్యక్షంగా కలువడం ద్వారా ఎనిమిది నెలల సమయంలోనే రూ.10 లక్షలు సేకరించారు. వచ్చిన నిధుల ద్వారా రెండు అదనపు తరగతి గదులను నిర్మించారు. ప్రారంభోత్సవం చేసి పాఠశాలకు అప్పగించారు. భవిష్యత్‌లోనూ విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు పూర్వ విద్యార్థులు పేర్కొనడాన్ని పలువురు అభినందిస్తున్నారు.

పాఠశాల అభివృద్ధికి మరింత కృషి

- సార మల్లేశం, పూర్వవిద్యార్థి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, ఇల్లంతకుంట



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదవిన వారందరం ఏకమై అదనపు తరగతి గదులు నిర్మించాలని నిర్ణయించాం. పూర్వ విద్యార్థుల ద్వారా రూ.10 లక్షలు సేకరించాం. పూర్వవిద్యార్థులను కలిసి ప్రణాళిక వివరించాం. స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. భవిష్యత్‌లో మరింతకొంత మంది విద్యార్థుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తాం. విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములమవడం సంతోషంగా ఉంది.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- కవ్వంపల్లి సత్యనారాయణ, ఎమ్మెల్యే, మానకొండూర్



ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి, వాటి బలోపేతానికి కృషి చేస్తున్నాం. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పూర్వవిద్యార్థులు తరగతి గదులు నిర్మించడం అభినందనీయం. దీనిని అన్ని గ్రామాల్లోని పూర్వవిద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలి. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మంచి గుర్తింపు లభిస్తుంది. పూర్వపు రోజులలో పాఠశాలల అభివృద్ధికి గ్రామస్థులు ప్రాధాన్యం ఇచ్చేవారు. ఇదే ఆనవాయితీ కొనసాగితే బాగుంటుంది.

అక్రమంగా మట్టి తరలింపు

- ప్రభుత్వ ఆదాయానికి గండి - పట్టించుకోని అధికారులు



రాత్రి వేళలో మట్టిని తరలిస్తున్న టిప్పర్

చందుర్తి, మార్చి 29: చందుర్తి మండలం తిమ్మాపూర్ శివారు నుంచి రాత్రి వేళలో అక్ర మంగా మట్టిని తరలిస్తున్నారు. కొన్ని రోజులుగా కొనసాగుతున్న అక్రమ మట్టి రవాణాపై ఎన్ని ఫిర్యాదులు వెళ్లినా నామ మాత్రపు చర్యలు తీసుకోవడంతో అక్రమార్కుల దందా ఇష్టారాజ్యంగా సాగుతోంది. రాత్రి సమయాల్లో ప్రభుత్వ భూమి నుంచి భారీగా మట్టిని తవ్వి వేములవాడకు నూతన గృహ నిర్మాణదారులకు విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై చందుర్తి తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎవరికీ మట్టి తరలింపు అనుమతి ఇవ్వలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

కోరుట్ల, మార్చి 29: పట్టణ శివారులోని జాతీయ రహదారి సబ్‌స్టేషన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి పట్టణానికి చెందిన దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం కోరుట్ల పట్టణం నుంచి మెట్‌పల్లి వైపు వెలుతున్న గూడపాటి దుర్గప్రసాద్, రాధ దంపతులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా మెట్‌పల్లి నుంచి కోరుట్ల వైపు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో దంపతులు తీవ్ర గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు 108 సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం అందించారు. 108 సిబ్బంది క్షతగ్రాతులను చికిత్స నిమిత్తం కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో దంపతులను మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల అసుపత్రికి తరలించారు. దుర్గప్రసాద్-రాధ దంపతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుడివాడకు చెందిన వారు కాగా 15 ఏళ్ల క్రితం మెట్‌పల్లి పట్టణంలోని నివాసం ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పని చేస్తున్నట్లు తెలిసింది.

వ్యభిచార గృహాలపై దాడులు

వేములవాడ, మార్చి 29: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధి ప్రాంతంలో గల వ్యభిచార గృహాలపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఇతర ప్రాంతాల నుంచి యువతులకు మాయ మాటలు చెప్పి తీసుకువచ్చి బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నారన్న సమాచారం మేరకు డిఎస్పి కే నాగేంద్రచారి నేతృత్వంలో వేములవాడ పట్టణ పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యభిచార గృహాల్లో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురు యువతులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో కలిసి కౌన్సెలింగ్ నిర్వహించారు. వరంగల్, కొత్తగూడెం ప్రాంతాల నుంచి వారిని ఇక్కడికి తీసుకువచ్చినట్లు గుర్తించారు. అనంతరం వారిని సిరిసిల్లలోని సఖి సెంటర్‌కు తరలించారు. వ్యభిచార గృహాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని డీఎస్పి నాగేంద్రచారి తెలిపారు.

ఏటీఎం దొంగల కోసం పోలీసుల గాలింపు

- బీహార్, ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌లపై పోలీసుల అనుమానం
- నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీస్ టీమ్


దొంగతనం జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)

హుజూరాబాద్, మార్చి 29: పట్టణంలోని నడిబొడ్డున గల ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగతనం చేసి పారిపోయిన వారి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇందుకోసం ఓ ప్రత్యేక పోలీస్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన గ్యాంగ్‌లపై పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నెల 18న హుజూరాబాద్ కోర్టు సమీపంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో సుమారు రూ. 25లక్షల నగదును పెట్టి బ్యాంకు అధికారులు వెళ్లారు. రెండ్రోజుల అనంతరం గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్లతో ఏటీఎం మిషన్‌ను కట్ చేసి, అందులోని రూ. 8.64లక్షలు దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. ఏటీఎం చోరీపై సీపీ అభిషేక్ మొహంతి పోలీసుల తీరుపై మండిపడ్డారు. రాత్రి వేళల్లో పోలీసుల గస్తీ బృందాలు తిరగకపోవడంతోనే ఈ దొంగతనం జరిగిందని, పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఏసీపీ శ్రీనివాస్‌జీ, టౌన్ సీఐ బొల్లం రమేష్ ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లి పాత నేరస్థుల వివరాలు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఏటీఎంలో దొంగతనం జరిగిన రాత్రి సెల్‌ఫోన్ ఆధారంగా డేటా సేకరిస్తున్నారు. కానీ సదరు గ్యాంగ్ నిర్వాహకులు సెల్‌ఫోన్ వాడకుండా జాగ్రత్తలు పడినట్లు సమాచారం. ఇటీవల పాత నేరస్థులు, జైలు నుంచి విడుదలైన వారి వివరాలను సేకరిస్తున్నారు. ఆరు నెలల క్రితమే హుజూరాబాద్ ఆర్టీసీ బస్టాండ్‌లోని ఏటీఎంను పగలగొట్టిన విషయం మరువకముందే ఈ దొంగతనం జరగడం విశేషం. ఏటీఎం దొంగతనం పోలీసులకు సవాల్‌గా మారింది.

కన్నుల పండువగా నృసింహుడి రథోత్సవం


స్వామివారి రథయాత్రలో పాల్గొన్న ప్రజలు


స్వామివారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు


స్వామివారిని దర్శనం చేసుకుంటున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మార్చి 29: ధర్మపురి లక్ష్మీనృసింహస్వామి రథోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య పూర్ణాహుతి అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహ, శ్రీ వేంకటేశ్వర, శ్రీ రామలింగేశ్వర స్వామి వారల ఉత్సవ మూర్తులను ఆలయం నుంచి బయటకు తీసుకొచ్చి రథాలపై ఆశీనులు చేశారు. భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారల రథాలను క్షేత్రంలోని పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారల రథాలను తిరిగి ఆలయం వరకు ఊరేగించారు. అర్చకులు రాత్రివేళలో చక్రతీర్థ స్నానానికై గోదావరి నదికి వెళ్లి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వధూవరులు ఇరువురికి పుష్పయాగం నిర్వహించారు.

యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమా చార్యులు, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచార్య, రమణచార్య, నరసింహమూర్తి, అశ్విన్, వంశీకృష్ణ, విజయ్, మోహన్, నవీన్, అరుణ్, హరినాథాచార్య, ప్రదీప్ రాత్రి 8 గంటల వరకు ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ పర్యవేక్షణలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహిం చారు. రథోత్సవ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని స్వామి వారలను దర్శించుకున్నారు. అలాగే ఆల యంలో స్వామి వారిని దర్శనం చేసుకున్న ప్రభుత్వ విప్‌ను వేదపం డితులు, అర్చకులు ఘనంగా ఆశీర్వదించి, స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, ఎంపీపీ ఎడ్ల చిట్టిబాబు, జడ్పీటీసీ బత్తిని అరుణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఆర్యవైశ్య మహిళా సంఘం జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు జక్కు పద్మ, ఆర్యవైశ్య వర్తక సంఘాల పట్టణ అధ్యక్షులు మురికి శ్రీనివాస్, పాల్గొన్నారు.


రథయాత్రను ప్రారంభిస్తున్న అర్చకులు


మంగళహారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

వరద కాలువకు నీటిని విడుదల చేయాలి


గంగాధరలో ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

గంగాధర, మార్చి 29: వరద కాలువకు నీటిని విడుదలచేసి పంటలను కాపాడాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గంగాధర మండలం కురిక్యాల వరద కాలువపై బీజేపీ ఆధ్వర్యంలో నీటిని విడుదల చేయాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బీజేపీ నాయకులు మాట్లాడుతూ వరదకాలువపై ఆధారపడి సాగు చేసిన వేలాది ఎకరాల్లో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి దశలో నీరందక కళ్ల ముందే పంటలు ఎండుతున్నాయని, ప్రభుత్వం సాగునీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ధర్నాతో రహదారిపై ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్, ఆయా మండలాల అధ్యక్షులు అశోక్, రవీందర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్‌గౌడ్, శ్రీపతి చంద్రశేఖర్, వినయ్ సాగర్, గుండారపు సంపత్, రేండ్ల శ్రీనివాస్, పంజాల ప్రశాంత్ పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల పట్టివేత

వీణవంక, మార్చి 29: మండలంలోని మామిడాలపల్లిలో పేకాట ఆడుతున్నారన్నా పక్కా సమాచారంతో పోలీసులు ఓ ఇంటిపై దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నామని ఎస్‌ఐ తోట తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పేకాట ఆడుతున్న వారి నుంచి 11,930 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి వారిని కోర్టులో హాజరు పరుచనున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీణవంక, మార్చి 29: మండలంలోని చల్లూరు, మామిడాలపల్లి మానేరు వాగుల నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చల్లూరు గ్రామనికి చెందిన బొంగోని తిరుపతి మామిడాలపల్లి గ్రామానికి చెందిన పురంశెట్టి రవీందర్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణ చేయడంతో వారిపై కేసు నమోదు చేసి ట్రాక్టర్లను పోలీసుస్టేషన్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయపట్నంలో చైన్ స్నాచింగ్

ధర్మపురి, మార్చి 29: ధర్మపురి మండలంలోని రాయపట్నం గ్రామంలో అక్కలి అంతమ్మ అనే మహిళ మెడలో నుంచి గుర్తు తెలియని వ్యక్తులు రెండు తులాల బంగారు పుస్తెల తాడును శుక్రవారం అపహరించారు. గ్రామంలోని పెట్రోల్ బంక్ సమీపంలో దోసకాయలు విక్రయిస్తున్న అంతమ్మ వద్దకు బైక్‌పైన ఇద్దరు వ్యక్తులు వచ్చారు. అనంతరం దోసకాయలు కొనుగోలు చేసినట్లు నటించి డబ్బులు ఫోన్ పే ద్వారా చెల్లిస్తానని చెప్పి ఆమె వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను తీసుకున్నారు. ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును వచ్చిన వ్యక్తులు స్నాచింగ్‌కు పాల్పడ్డారు. దీంతో బాధితురాలు బోరున విలపించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

లింగంపేటలో వరుస చోరీలు

జగిత్యాల, మార్చి 29 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుస చోరీలు జరిగాయి. రెండురోజులుగా దొంగలు విద్యుత్ కరెంటు మోటార్‌తో పాటు బోరు మోటారును అపహరించుకు వెళ్లారు. ఎలుకబావి వాడలో నూతనంగా నిర్మించిన ఓ గృహం వద్ద బోరు మోటారును అపహరించుకవెళ్లిన దొంగలు తాజాగా సిరికొండ ధర్మయ్యకు చెందిన వ్యవసాయ మోటారును అపహరించారు. దీంతో రైతులతో పాటు ప్రజలు ఆందోళనకు గురువుతున్నారు. పోలీసులు నైట్ బీట్లను మరింత పెంచి దొంగతనాలు జరుగకుండా అరికట్టాలని కొరుతున్నా రు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంటికి నిప్పంటించుకొని యువకుడి ఆత్మహత్య


కల్యాణ్‌రామ్ (ఫైల్)

రాయికల్, మార్చి 29: రాయికల్ పట్టణానికి చెందిన బుస్స కల్యాణ్‌రామ్(18) అనే యువకుడు మానసిక స్థితి సరిగా లేక ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. ఈ యువకుడి మృతదేహాన్ని ఇటిక్యాల గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫాంలో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాయికల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాయికల్ పట్టణానికి చెందిన బుస్స కళ్యాణ్ రామ్ ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు ఇతని మానసిక స్థితి బాగలేకపోవడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. తీవ్ర డిప్రెషన్‌లో ఉన్న కల్యాణ్ రామ్ గతంలో ఆత్మహత్యకు యత్నించగా కుటుంబసభ్యులు కాపాడారు. ఈ యువకుడు గురువారం రాత్రి ఇంట్లోంచి వెళ్లిపోయి తిరిగి రాకపోవడంతో శుక్రవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతలోనే ఆ యువకుడు శవమై కనిపించాడని తెలిపారు. మృతుని తండ్రి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో ఆశా కార్యకర్త మృతి


రాజేశ్వరి(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి 29: మండలంలోని నేదునూర్ గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కవ్వంపల్లి రాజేశ్వరి(43) వడదెబ్బతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వంపల్లి రాజేశ్వరి బుధవారం ఎండలో గ్రామంలో సర్వే నిర్వహించింది. సాయంత్రం అస్వస్థతకు గురికాగా కరీంనగర్‌లోని అసుపత్రికి తరలించారు. అసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. రాజేశ్వరికి ఇద్దరు కుమారులు, భర్త ఉన్నారు.

● రాజేశ్వరి కుటుంబాన్ని ఆదుకోవాలి..

ఆశా కార్యకర్త కవ్వంపల్లి రాజేశ్వరి పని ఒత్తిడి కారణంగా వడదెబ్బ తగిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిందని ఆమె కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎడ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారేళ్ల శ్రీలత డిమాండ్ చేశారు. శుక్రవారం వారు నేదునూర్‌లో రాజేశ్వరి మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రాజేశ్వరి కుటుంబానికి 10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ ఆశా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నాయిని రజిత, ప్రధాన కార్యదర్శి వెంకట లక్ష్మి, నాయకులు విజయ, స్వప్న, శ్వేత, రజిత, అంజలి పాల్గొన్నారు.

టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

కరీంనగర్ టౌన్, మార్చి 29: విద్యాహక్కు చట్టం-2009 అమలు కంటే ముందు నియామకమైన టీచర్లకు పదోన్నతులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా నగరంలోని జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు వై ఉమారాణి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం -2009, ఒకటి ఏప్రిల్ 2010 నుంచి అమలులోకి వచ్చిందని, ఆ తేదీ కంటే ముందు నియామకమైన టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం రఘుశంకర్‌రెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో రాష్ట్రంలో పాఠశాల విద్య అస్తవ్యస్తమైందని, ఈ ప్రభుత్వమైనా పాఠశాల విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ పల్కల ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ 16 నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని కోరారు. ఎన్నికల కమిషన్ అనుమతి తీసుకొని పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను విడుదల చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి తూముల తిరుపతి కోరారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా జమ్మికుంట మండలం కోరపల్లి హైస్కూల్‌లో పనిచేస్తున్న ఆవాల నరహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు కె రాజమౌళి, ఏ దామోదర్, ఎస్ అంజయ్య, ఎ శ్రీనివాస్, కె కిషన్‌రెడ్డి, టి తిరుపతి, పి నర్సయ్య, వి రాంకిరణ్ పాల్గొన్నారు.

మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

బోయినపల్లి, మార్చి 29: ఓ వ్యక్తిని ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపిస్తానని నమ్మించి డబ్బులు కాజేసి మోసం చేసిన వ్యక్తిని శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్లు బోయినపల్లి ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపారు. మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన కొండ చిరంజీవి అనే వ్యక్తిని కొనరావుపేట మండలంలోని గోత్రాల ప్రశాంత్ గల్ఫ్ పంపిస్తానని నమ్మించాడు చిరంజీవి వద్ద లక్ష పదివేల రూపాయలను తీసుకొని ప్రశాంత్ మోసం చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ప్రశాంత్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్ పంపినట్టు ఎస్సై తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్ట్

మల్లాపూర్, మార్చి 29: మండలంలోని ఓబులాపూర్ గ్రామ శివారులోని చెక్ పోస్టు వద్ద గంజాయి రవాణా చేస్తున్న నిందితులను పట్టుకున్నట్లు మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. శుక్రవారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఎస్పీ సన్‌ప్రీతిసింగ్ ఆదేశాల మేరకు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సిబ్బందితో మండలంలోని ఓబులపూర్ గ్రామ శివారులోని చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలను చేపట్టారు.

అదే సమయంలో అక్కడికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలోని నార్నూర్ గ్రామానికి చెందిన నాంపెల్లి రామేశ్వర్, బాలుడి సహాయంతో గంజాయిని తీసుకొని ద్విచక్ర వాహనంపై అక్కడి వచ్చారు. అక్కడ ఉన్న పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా ఎస్సై సిబ్బంది సహాయంతో వారిని పట్టుకున్నారు. నిందితులను విచారించగా వారి వద్ద ఐదు వేల రూపాయల విలువ గల 200 గ్రాముల గంజాయి దొరికింది. దీనిని మండలంలోని పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో గంజాయి విక్రయించడానికి తీసుకెళ్తతున్నట్లు తెలిపారు. వారి వద్ద గంజాయి, ద్విచక్రవాహనం, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చాకచక్యంగా నిందితులను పట్టుకున్న ఎస్సైతో పాటు సిబ్బంది కిరణ్‌కుమార్, రాజేష్, మారుతిలను జిల్లా ఎస్పీ, డీఎస్పీ, సీఐ అభినందించారు.


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

సిరిసిల్ల జిల్లాలో రూ. 2.96 లక్షలు పట్టివేత



ఎదురుగట్ల వద్ద పోలీసుల తనిఖీలో పట్టుబడ్డ లక్ష రూపాయల నగదు


పెద్దమ్మ చెక్‌పోస్టు వద్ద నగదును పట్టుకున్న పోలీసులు

గంభీరావుపేట, మార్చి 29: గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజి చెక్ పోస్టు వద్ద ఏలాంటి అధారాలు లేకుండా తరలిస్తున్న రూ లక్ష 41 వేల నగదును పట్టుకున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్ తెలిపారు. కామారెడ్డికి చెందిన భరద్వాజ్ అనే వ్యక్తి ఆర్టీసీ బస్సులో లక్షా 41 వేలను ఏలాంటి అధారాలు లేకుండా తీసుకవెళ్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. పట్టుకున్న నగదును సీజ్ చేసి ఎలక్షన్ సెల్ రిటర్నింగ్ అఫీసర్‌కు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రుద్రంగి: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రుద్రంగి మండల కేంద్రం శివార్లో రాజన్న సిరిసిల్ల, జగిత్యాల రెండు జిల్లా సరిహద్దు చెక్ పోస్టును చందుర్తి సర్కిల్ సీఐ వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా 55 వేల నగదును పట్టుకొని సీజ్ చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్యూటీలో ఉన్న ప్రతీఒక్క అధికారి అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సందర్భంగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సిరిసిల్ల అశోక్, తదితరులు ఉన్నారు

వేములవాడ రూరల్: వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మారుతీ తెలిపారు. ఎదురుగట్ల వద్ద శుక్రవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా వేములవాడ పట్టణానికి చెందిన అబ్దుల్ రహీం లక్ష రూపాయలను కలిగి ఉండగా స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మారుతీ మాట్లాడుతూ ఎన్నికల నియామవళి ప్రకారం ఒక వ్యక్తి సరైన ఆధారాలు లేకుండా 50 వేలకు మించి డబ్బును కలిగి ఉండవద్దన్నారు.

ఎస్సారెస్పీ డి-40 అనుబంధ కాల్వల ధ్వంసం

- పట్టించుకోని ఎస్సారెస్పీ అధికారులు
- 100 ఎకరాల పంటలకు ముప్పు

కోరుట్ల రూరల్, మార్చి 29: పట్టణ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాల్వకు అనుసందానంగా అధికారులు సాగు, తాగు నీటి సరఫరా కోసం చెరువులో నింపే విధంగా డి-40 కాల్వను నిర్మించారు. మండలంలో పలు గ్రామాలకు తాగు, సాగునీరు అందే విధంగా అనుబంధంగా కాల్వలను ఏర్పాటు చేశారు. మండలంలోని గుమ్లాపూర్, వెంకటాపూర్, మాదాపూర్, పైడిమడుగు శివారు వరకు డి-40 కాల్వకు పిల్ల కాల్వలను ఏర్పాటు చేసి సాగు నీటి సరఫరా చేస్తున్నారు. అదే విధంగా డి-40 కాల్వకు పలు ప్రాంతాల్లో పిల్ల కాల్వలను ఏర్పా టు చేసి వెంకటాపూర్ గ్రామ శివారులోని చింతల చెరువు వరకు కాల్వ నిర్మాణం చేసి సాగునీరుతో పాటు చెరువు నిండే విధంగా చర్యలను తీసుకున్నారు. ప్రస్తుతం కోరుట్ల పట్టణ శివారులోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాతంలో ఉన్న భూయజమానులు ఉప కాల్వకు ఏర్పాటు చేసిని పిల్ల కాల్వను ధ్వంసం చేసి కబ్జాకు చేసుకుంటున్నారు. అక్కడ ఉన్న బడా వ్యాపారులు తమ స్థలంలో ప్రహారీ నిర్మాణాలను చేపట్టారు. ప్రహారీ నిర్మాణంలో వారి భూమి నుంచి వెలుతున్న పిల్ల కాల్వను ధ్వంసం చేసి అక్రమ నిర్మాణం చేయగా కొందరు తాత్కాలికంగా కాల్వ నిర్మాణం చేసి కాల్వ భూమిని కబ్జా చేయడం విమర్శలకు తావిస్తోంది. దీంతో పట్టణ శివారు నుంచి మండలంలోని వెంకటాపూర్ ప్రాంతంలోని చింతల చెరువు వరకు సుమార్ వంద ఎకరాల వరకు పంట సాగుకు నీరు అందకా ఎండిపోయే పరిస్థితి నెలకొంది. డి-40 కాల్వ వద్ద భూ యజమానలు ఇలాంటి చర్యలకు పాల్పడడంతో చివరి ఆయకట్టు వరకు సాగు నీరు అందక వంద ఎకరాల్లో పొలాలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని అధికారులకు రైతులు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు పర్యవేక్షణ జరిపి సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


పిల్ల కాల్వను ధ్వంసం చేసి నిర్మాణం చేపడుతున్న ప్రదేశం

రాజన్న క్షేత్రంలో బలిహరణం

- స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం

వేములవాడ, మార్చి 29: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శివకల్యాణోత్సవాలలో భాగంగా శుక్రవారం జంగమ అర్చకులు బలిహరణం ఘనంగా నిర్వహించారు. శివకల్యాణ ఉత్సవాల మూడోరోజు ఉదయం రాజరాజేశ్వరస్వామివారికి స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు తొలుత మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, అభిషేకములు, పారాయణములు నిర్వహించారు. అనంతరం అవాహిత దేవతాహోమము, ఔపాసనము, బలిహరణము గావించారు. అనంతరం రాత్రి స్వామివారి కల్యాణమంటపంలో సదస్యము నిర్వహించారు. ఆలయ అధికారులు, భక్తులు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు.

● నేడు రథోత్సవం..

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రంలో శనివారం స్వామివారల రథోత్సవం నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే శివకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం పార్వతీరాజరాజేశ్వరస్వామివారల కల్యాణం నిర్వహించగా, శనివారం మధ్యాహ్నం గం.3-05లకు పార్వతీ రాజరాజేశ్వరస్వామి, లక్ష్మీఅనంతపద్మనాభస్వామివారలను రథంపై పట్టణ వీధుల మీదుగా ఊరేగిస్తారు. రాత్రి 8.30 గంటలకు స్వామివారి కల్యాణ మంటపంలో శృంగార వసంతోత్సవం నిర్వహిస్తారు.

● భక్తుల సందడి..

వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయ కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించిన అనంతరం సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించుకున్నారు. శివకల్యాణం ఉత్సవాల సందర్భంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ అమ్మవారి ఆలయం సైతం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా ఆలయ అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.


బలిహరణము నిర్వహిస్తున్న జంగమ అర్చకులు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


కోడె మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే



ఎల్లారెడ్డిపేటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

సిరిసిల్ల రూరల్, మార్చి 29: సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్ సెయింట్‌మేరి సీఎస్ఐ, బీవై నగర్‌లో బెతెస్త ప్రార్థన మందిరంతోపాటు పెద్దబోనాల రోడ్‌లోని హోసన్నాలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెయింట్‌మేరీ సీఎస్ఐ పాస్టర్ శ్యాంకల్పల్, పాస్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిలలో గుడ్‌ఫ్రైడే వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చిపాస్టర్లు మాట్లాడుతూ దయామయుడైన ఏసుక్రీస్తు చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు పయనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు ఎరవెల్లి మోజేస్, సత్యప్రకాష్, ఏసయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతోపాటు నారాయణపూర్, బండలింగంపల్లి, బొప్పాపూర్, దుమాల, అల్మాస్‌పూర్, రాజన్నపేట, తదితర గ్రామాల్లో గుడ్ ఫ్రైడేను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు రాజేశ్, కిశోర్‌కుమార్, దీప్తికుమార్, అబ్రహం, మధు, రత్నాకర్, ప్రేమ్‌కుమార్, క్రీస్తుదాస్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : వీర్నపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



సిరిసిల్లలో ప్రార్థనలో పాల్గొన్న క్రైస్తవులు

ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ ప్రభుత్వం

సిరిసిల్ల రూరల్, మార్చి 29: దేశంలో అధికారంలో ఉన్న ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్ కార్మిక భవనంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ పాలనకు వ్యతిరేకంగా శనివారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన భవనంలో 11 వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సీపీఐ వామ పక్షాల జాతీయ నాయకులు డి.రాజా ఏచూరి తదితరు లు హాజరుకానున్నట్లు చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. సమావేశంలో నాయకులు పంతం రవి, కడారి రాములు, మీస లక్ష్మణ్, మంద సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నియంత్రృత్వ పాలనకు చరమగీతం



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేములవాడ టౌన్, మార్చి 29: పదేళ్ల నియంతృత్వ పాలనకు ముంపు గ్రామాలు చరమగీతం పాడాయని, ప్రజా ప్రభుత్వ ఏర్పాటులో ముందు వరుసలో ఉన్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ మండలం సంకెపల్లి, శాభాష్‌పల్లి గ్రామాల్లో నిర్వహించిన కృతజ్ఞత ర్యాలీలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులకు అన్యాయం చేసిందని గ్రహించి మొదటగా ఆ పార్టీ ఓటమిని కోరుకున్నది ముంపు గ్రామాల నిర్వసితులేనని గుర్తు చేశారు. ముంపు గ్రామాల సమస్యలపై ముందు నుంచి పోరాడిన వాడినని, గ్రామాల్లోని అనువణువు తెలుసని అన్నారు. ప్రజల మద్దతుతో ఏర్పడిన ప్రభుత్వంపై బావ బామ్మర్దులు శాపనార్థాలు పెడుతున్నారని, ఎన్నికల్లో ఓడిపోయాం, పార్టీని నాయకులు వీడి వెళ్తున్నారనే బాధ తట్టుకోలేక పోతున్నారని అన్నారు. వరంగల్‌లో కడియం శ్రీహరి, వ్యాపారులు, భార్యాభర్తలు, సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, వేములవాడలో తన మాటలను కూడా ట్యాప్ చేశారని ఆరోపించారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చినప్పుడే తెలంగాణ ప్రజల పేగుబంధాన్ని తెంచుకున్నారన్నారు. కవిత బతుకమ్మను తానే కనిపెట్టినట్లు చేసిందని, ప్రస్తుతం లిక్కర్ స్కామ్‌లో తీహార్ జైల్‌లో ఉందన్నారు. ఫోర్జరీ, చీటింగ్ కేసులో సంతోష్‌రావు, ఫోన్ ట్యాంపరింగ్ కేసులో కేటీఆర్, హరీష్‌రావు, మాజీ సీఎంపై రోజుకో కథనం వినిపిస్తుండడంతో మతిభ్రమించి మాట్లాడుతున్నారని హేలన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చలికాలంలో ఏర్పడిందని, వేసవి అయిపోయి వర్షాకాలంలో వర్షాలు పడకుంటే కరువు వచ్చిందంటే ఒక అర్థం ఉంటుందని అన్నారు. ఇప్పుడు వర్షాలు పడడం లేదని, వాళ్లు చేస్తున్న వాదనలో నిజం లేదని అన్నారు. బావ, బామ్మర్దులు కలిసి రాష్ట్రంలో కృత్రిమ కరువు సృష్టించాలని కంకణం కట్టుకున్నట్లు అనిపిస్తోందన్నారు. అనుపురంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ శిబిరంలో 1400 మంది మహిళలు శిక్షణ తీసుకుంటున్నారని, వారికి కుట్టు మిషన్లు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్స్ కుట్టే బాధ్యత ఇప్పిస్తామన్నారు. ముంపు గ్రామాల ప్రజల పడుతున్న కష్టాల గురించి తెలిసి పాదయాత్ర చేపట్టిన సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ముంపు గ్రామాల్లో నిద్రచేసి ప్రజలకు ధైర్యాన్ని నింపారని గుర్తు చేశారు. సెస్‌లో అవినీతి అక్రమాలు జరిగాయని మాట్లాడి, ఇప్పుడు మా ప్రభుత్వం వద్దకు రావడం వెనక ఏం మతలబు జరిగిందని ప్రశ్నించారు. సెస్‌ను ఈఆర్‌సీ ట్రాన్స్‌కోలో విలీనం చేయాలని వస్తే అదే రోజు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడనన్నారు. సెస్‌ను కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని గుర్తు చేశారు. ముంపు గ్రామాల ప్రజలకు పార్లమెంట్ ఎన్నికల తరువాత ప్రభుత్వం తరఫున తీపి కబురు అందుతుందని, త్వరలోనే న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, జిల్లా నాయకులు చింతపల్లి శ్రీనివాస్‌రావు, పండగ ప్రదీప్, పండుగు పర్శరాములు, మారవేని రాజ్‌కుమార్, ఎర్రం ఆగయ్య, కత్తి కనుకయ్య, ఇటిక్యాల లింగయ్య, జమాల్, ఎర్రం సత్తయ్యనాంపల్లి నాగరాజు, జింక నవీన్ ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణ

వేములవాడ మండలం రుద్రవరం ఎంపీటీసీ గాలిపెల్లి సువర్ణస్వామి శుక్రవారం అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. శాభాష్‌పల్లిలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత ర్యాలీలో సుమారు 200 మంది కార్యకర్తలు, అనుచరులతో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. వేములవాడ మండలం సంకెపల్లికి కృతజ్ఞత ర్యాలీకి హాజరైన ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం, ఇళ్ల పట్టాలు, ఇతరాత్ర ప్యాకేజీ అందలేదని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని పేర్కొన్నారు. త్వరలో నిర్వాసితులకు తీపికబురు చెబుతానని ప్రభుత్వ విప్ పేర్కొనడంతో సంతోషం వ్యక్తం చేశారు. సంకెపల్లి ఎంపీటీసీ బుర్ర లహరిక, బీజేపీ మండల అధ్యక్షుడు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర శేఖర్, రాష్ట్ర నాయకులు జింక అనిల్‌కుమార్, చింతపల్లి మోహన్‌రావు, రెడ్డవేని రాజు, కాచం నిఖిల్ ఉన్నారు.

ఆలయ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం



విరాళం అందజేస్తున్న రఘురాం

వేములవాడ, మార్చి 29 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్న దానం ట్రస్టుకు స్థానిక వ్యాపారి నగుబోతు రఘురాం శుక్రవారం ఆలయ నిత్య అన్నదాన విభాగం ఉద్యోగికి లక్ష రూపాయల విరాళం అందజేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఉచితంగా అన్న ప్రసాదం అందించడానికి వీలుగా విరాళం అందజేసినట్టు తెలిపారు.

కాంగ్రెస్ హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దు

ఇల్లంతకుంట, మార్చి 29: కాంగ్రెస్ ఇచ్చే హామీలను నమ్మి మరోసారి మోసపోవద్దని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ యువజన సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదన్నారు. రైతులకు ఇస్తామన్న రూ.15 వేల సహాయం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఐదు సంవత్సరాలు ఎంపీగా ఉన్న బండి సంజయ్‌కుమార్ నియోజకవర్గ అభివృద్ధికి ఏనాడూ కృషి చేయలేదన్నారు. విద్యావంతుడైన వినోద్‌కుమార్ కరీంనగర్‌కు రూ.వెయ్యి కోట్లతో స్మార్ట్‌సిటీ తీసుకొచ్చారన్నారు. మనోహరబాద్, కొత్తపల్లి రైల్వేలైన్ ఏర్పాటుకు కృషిచేశారన్నారు. సమావేశంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, యువజన సంఘం నాయకులు జక్కుల నాగరాజు, ఏనుగు రవీందర్ రెడ్డి, సాదుల్, ఎంద్ర చందన్, సావనపల్లి అనీల్‌కుమార్, శ్రీనివాస్, బాలకిషన్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీదత్, వెంకటేశం, రఘు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు అందజేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 29: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు స్థానిక ట్రాక్టర్ యూనియన్ సభ్యులు శుక్రవారం వీపీవోకు రూ.4500 నగదును అందజేశారు. గ్రామంలో సీసీ కెమెరాల కోసం తమ వంతు ఆర్థిక సాయం అందజేశామని పేర్కొన్నారు. ట్రాక్టర్ యూనియన్ సభ్యులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ట్రాక్టర్ యూనియన్ అధ్యక్షుడు నర్సయ్య, సభ్యులు బాలయ్య, రాజు, శ్రీను పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కార్యవర్గం

రుద్రంగి మార్చి 29: రుద్రంగి మండల కేంద్రంలో బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమీక్ష సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు వర్ధవెల్లి స్వామిగౌడ్, నియోజకవర్గ కన్వీనర్ గసికంటి అరుణ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగి మండల బీఎస్పీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. రుద్రంగి మండల అధ్యక్షులుగా మానాలకు చెందిన గుడిసె గంగరాజాం, రుద్రంగికి చెందిన సుంచు అనిల్ కుమార్ ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బండెల దేవరాజ్, వేములవాడ నియోజకవర్గ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కాదాసు మహేందర్, సీనియర్ నాయకులు దర్శనం గంగాధర్, కోరుట్ల రమేశ్, దయ్యాల ఉదయ్, ఏనుగుందుల సతీష్ పాల్గొన్నారు.

ధర్మపురిలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 29: ధర్మపురి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు పదో రోజు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం యాగశాల వద్ద పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల సేవలు

బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం పలువురు భక్తులు సేవలు అందించారు. ఉత్సవాల్లో నిత్యం నిర్వహించే అన్నదానంలో భాగంగా టీటీడీ ధర్మశాల ఆవరణలో దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈవో శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ పర్యవేక్షణలో ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు సేవలు అందించారు. కౌన్సిలర్లు జక్కు పద్మ-రవీందర్, సంతోషి-దినేష్, అన్న పూర్ణ సేవా సమితి బాధ్యులు పెద్దనరేందర్, పాత బాలచందర్, వాసవీ సేవాదళ్ పట్టణ అధ్య క్షుడు రమేష్, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

బలహీనవర్గాలకు బాసటగా నిలిచిన టీడీపీ



సిరిసిల్లలో టీడీపీ ఆవిర్భావ వేడుకల్లో నాయకులు

సిరిసిల్ల రూరల్, మార్చి 29 : బడుగు బలహీన వర్గాలకు టీడీపీ అండగా నిలిచిందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి అవునూరి దయాకర్‌రావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం తెలుగు దేశం పార్టీ 42వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి తారకరామారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దయాకర్‌రావు మాట్లాడుతూ 42 సంవత్సరాల క్రితం హైదరాబాద్ కేంద్రంగా బలహీనవర్గాలకు బాసటగా నందమూరి తారక రామారావు పార్టీని ఏర్పాటు చేశారన్నారు. బీసీ ఎస్సీఎస్టీలకు రాజ్యాధికారం కల్పించే లక్ష్యంతో ఎన్టీఆర్ పెట్టిన టీడీపీ పార్టీ బలహీన వర్గాల్లో మదిలో చెరగని ముద్ర వేసుకుందన్నారు. రాబోయో రోజుల్లో పార్టీకి తెలంగాణలో పూర్వ వైభవం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తీగల శేఖర్‌గౌడ్, టీఎన్ఎస్ఎఫ్ కరీంనగర్ పార్లమెంటరీ అధ్యక్షుడు మోతెరాజిరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్రా ఉపాధ్యక్షుడు నక్కరాజయ్య, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అడెపు లక్ష్మీనారాయణ, కోనరావుపేట జడ్పీటీసీ అభ్యర్థిమోతె బాలవ్వ, మోతె స్నేహ రెడ్డి, పంజా బాలరాజు, మిద్దె ప్రకాష్, జెట్టి కోమురమయ్య, గుజ్జె అశోక్, పండుగ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : తెలుగు దేశం ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ పటిష్టతకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నారాయణగౌడ్, రంగారావు, పోచయ్య, చంద్రారెడ్డి, దాసు తదితరులు పాల్గొన్నారు.

అధికారం పోగానే కేటీఆర్‌కు రైతులు గుర్తుకొచ్చారు



సిరిసిల్లలో మాట్లాడుతున్న గడ్డం నర్సయ్య

సిరిసిల్ల రూరల్, మార్చి 29: అధికారం పోగానే కేటీఆర్‌కు రైతులు గుర్తుకు వచ్చారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం నర్సయ్య అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుల పంటలు ఎండిపోతున్నాయంటూ కేటీఆర్ దుష్ప్రచారం చేయడాన్ని ఖండించారు. అధికారంలో ఉన్నప్పుడు పంటలు ఎండిపోయినా, వడగళ్ల వర్షాలకు పంటలు దెబ్బతిన్నా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పుడు పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ పొలాల చుట్టూ తిరగం హాస్యాస్పందంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోవడంతో ఈ పరిసితి వచ్చిందనే విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, రాష్ట్ర నాయకుడు నాగుల సత్యనారాయణగౌడ్, నాయకులు ఆకునూరి బాలరాజు, వైద్యశివప్రసాద్, వెల్ముల తిరుపతిరెడ్డి, మ్యాన ప్రసాద్, గడ్డం కిరణ్ బొప్ప దేవయ్య, నీలి రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలో ఎక్సైజ్ కార్యాలయం

- గదులు సరిపడక ఇబ్బందులు



అద్దె భవనంలో కొనసాగుతున్న కార్యాలయం

ఎల్లారెడ్డిపేట, మార్చి 29: ఎల్లారెడ్డిపేట అబ్కారీ కార్యాలయం ఇరవై ఏళ్లుగా అద్దె భవనంలో కొనసాగుతోంది. ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, కోనరావుపేట, ముస్తాబాద్ మండలాల్లోని గ్రామాల్లో గుడుంబా, కల్తీ కల్లు, నల్ల బెల్లం, అనుమతి లేని మద్యం అమ్మకాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఎక్సైజ్ స్టేషన్‌కు నేటికి సొంత భవనం లేక ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలోని ఓ అద్దె భవనాన్ని తీసుకొని నెలనెలా రూ. 5వేలు చెల్లిస్తూ కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. భవనంలో మొత్తం ఐదు గదులున్నాయి. రెండు ఇరుకైన గదుల్లో సీఐ, సిబ్బంది విధులను కొనసాగిస్తున్నారు. రికార్డులను భద్రపరిచేందుకు అనువైన గదులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి గదుల్లోనే నెట్టుకొస్తున్నారు.

పట్టుకున్న వాహనాలు, నల్ల బెల్లంతో ఇబ్బందులు

ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి, కోనరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో అక్రమంగా కొనసాగుతున్న నల్ల బెల్లం, సారా రవాణాకు వినియోగించిన వాహనాలను భద్రపరిచేందుకు కార్యాలయంలో స్థలం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని వాహనాలను కార్యాలయం ఆవరణలో ఉంచాల్సి వస్తోంది. బెల్లం నిల్వకు ఓ గది సరిపోవడంతో తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతోపాటు సొంత భవనంలో కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు

- శ్రీనివాస్, సీఐ ఎక్సైజ్

ఎక్సైజ్ స్టేషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. మండల కేంద్రంలో సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేశారు. నిధులు మంజూరవగానే పనులను ప్రారంభించి సొంత భవనంలో కార్యాలయం కొనసాగేలా చూస్తాం.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి



సిరిసిల్లలో మాట్లాడుతున్న విమల

సిరిసిల్ల రూరల్, మార్చి 29 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కార్మికులకు జీవన భృత ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి జివ్వాజి విమల డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని ఐద్వా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో వంద రోజుల్లో అర్హులైన వారందరికీ రూ.4 వేల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చిందన్నారు. వందరోజులు దాటినా సీఎం రేవంత్‌రెడ్డి దాని ఊసే ఎత్తడం లేదన్నారు. నెలనెలా రెండు వేల పింఛన్ కూడా ఇవ్వడం లేదన్నారు. జీవనభృతిని వెంటనే అమలు చేయాలని, నెలనెల ఒకటో తేదీన పింఛన్ డబ్బులు అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఐద్వా ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ, వడ్డ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ దీక్షాపరులకు అల్పాహారం



అల్పాహారం ఏర్పాటు చేసిన ముస్లింలు

వేములవాడ టౌన్, మార్చి 29 : వేములవాడ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డుకు చెందిన నాంపల్లిలో ముస్లింలు అదే గ్రామానికి చెందిన హనుమాన్ దీక్షాపరులకు శుక్రవారం రాత్రి అల్పాహారం ఏర్పాటు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా తామంతా ఒక్కటేనని కుల, మత వివక్షకు తావులేకుండా గ్రామంలో కలిసి ఉంటున్నామని తెలియజేస్తూ అల్పాహారాన్ని అందజేశారు.

ఎంపీలుగా వినోద్‌కుమార్, బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యం

ఎల్లారెడ్డిపేట, మార్చి 29: కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని గ్రామాల్లో ఎంపీలుగా కొనసాగిన బోయినపల్లి వినోద్‌కుమార్, బండి సంజయ్ చేసిన అభివృద్ధి శూన్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య ఆరోపించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్‌లోని పల్లెలు కాంగ్రెస్ ఎంపీలు చొక్కారావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్ హయాంలోనే ప్రగతి పథంలోకి వచ్చాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఏం చేశారో ప్రజలకు వివరించి ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు అభ్యర్థించాలన్నారు. దత్తత గ్రామమైన వీర్నపల్లిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ గ్రామంలో ఏం అభివృద్ధి పనులు చేపట్టారో వివరించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత బీజేపీ ఎంపీ సంజయ్ గ్రామాలను సందర్శించలేదన్నారు. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్, బీజేపీ ఎంపీలు చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ హయాంలో జరిగిన ప్రగతిపై తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు లక్ష్మారెడ్డి, తిరుపతి, బాబు, బుచ్చాగౌడ్, బాల్‌రెడ్డి, రాంరెడ్డి, నరేందర్, శ్రీపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చందుర్తి, మార్చి 29 : అక్రమంగా రాత్రి వేళలో ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను చందుర్తి పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. తిమ్మాపూర్, ఆసిరెడ్డిపల్లి గ్రామాల శివారులోని కొత్తచెరువు ప్రాంతం నుంచి ఎక్స్‌కావేటర్‌తో పది ట్రాక్టర్లలో ఇసుకను నింపి తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకోవడంతో ఎక్స్‌కావేటర్‌తోపాటు ఆరు ట్రాక్టర్లతో పరారయ్యారు. నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు నిర్మించారు.. డ్రైయినేజీ మరిచారు



గంభీరావుపేటలో ఇళ్ల మధ్య పారుతున్న మురికి నీరు

గంభీరావుపేట, మార్చి 29 : గంభీరావుపేట మండల కేంద్రంలో కొన్ని కాలనీల్లో డ్రెయినేజీలు లేక మురికి నీరు ఇళ్ల ముందే పారుతోంది. కొత్తగా ఏర్పడిన కాలనీలతోపాటు మరికొన్ని చోట్ల సీసీ రోడ్లు నిర్మించి మురికి కాలువలు నిర్మించడం మరిచారు. దీంతో మురికి నీటితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా ఎల్లమ్మ కాలనీలో మురుగు నీరు ఇళ్ల ముందు పారుతుండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు వృద్ధి చెంది విష జ్వరాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

రైతులపై కేటీఆర్ మొసలి కన్నీరు

తంగళ్లపల్లి, మార్చి 29: అధికారంలో ఉన్నప్పుడు రైతులు నష్టపోతే కనీసం కన్నెత్తి చూడని కేటీఆర్ ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నా రని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ విమర్శించారు. శుక్ర వారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉండి రైతులను గోస పెట్టింది మీరు కాదా? అని ప్రశ్నించారు. కూలి పోయే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి కరువుకు కాంగ్రెస్ కారణమని చెప్పాడాన్ని తప్పుబట్టారు. అధికారంలో ఉన్నప్పుడు బస్వాపూర్, బాలమల్లుపల్లె రైతులు పంట నష్టపోతే కనీసం పరామర్శించని కేటీఆర్ కాంగ్రెస్‌ను విమర్శించడం సిగ్గు చేటన్నారు. అప్పుడు కాంగ్రెస్ నాయకులు రైతులను పరామర్శించిన ఫొటోలు, పత్రికలో ప్రచురితమైన వార్తలను ప్రదర్శించారు. సిరిసిల్లలో భిక్షాటన చేస్తే కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదన్నారు. రైతులకు సంకెళ్లు వేసిన సంఘటనను గుర్తు చేశారు. సిరిసిల్లలో ప్రైవేట్ ఫంక్షన్‌లకు హాజరైన కేటీఆర్ రైతులు ఏమైనా అనుకుంటారని నామమాత్రంగా పరామర్శించారన్నారు. పక్కనే ఉన్న సిద్దిపేట జిల్లాలో హరీశ్‌రావు కాలువల ద్వారా నీటిని అందిస్తున్నారని, కేటీఆర్ ఎందుకు కాలువలు ఏర్పాటు చేసి సాగునీటిని అందివ్వలేదో చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలకు అండగా ఉంటుందని, నష్టపోయిన రైతులకు రూ.10 వేలు పరిహారం చెల్లిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పుర్మాణి లింగారెడ్డి, లింగాల భూపతి, భైరినేని రాము, మునిగెల రాజు, నేరెళ్ల నర్సింగం, ఆసాని సత్యనారయణరెడ్డి, గుగ్గిళ్ల శ్రీకాంత్, గడ్డం మధుకర్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్, మీరాల శ్రీనివాస్, ఆరెపల్లి బాలు, బండి పర్శరాములు, రంగు చంద్రయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

ఇల్లంతకుంట, మార్చి 29: ఎన్నికల నియమావళిని అన్ని పార్టీలు పాటించాలని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు పరిమితులకు లోబడి వ్యవహరించాలని సూచించారు. సోషల్‌మీడియాలో ఇతర పార్టీలను, వ్యక్తులను కించపర్చేలా పోస్టింగులు పెడితే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశాలు నిర్వహిస్తే ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్సై లింగాల రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి : అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని సీఐ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలంలోని పోలీస్ స్టేషన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బోర్డులు తొలగించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్సై రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షుడు ప్రశాంత్, అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

గంభీరావుపేటలో..

గంభీరావుపేట: ప్రశాంత వాతావరణంలో పార్లమెంట్ ఎన్నికలను నిర్వహించుకోవాలని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా అందరూ సహకరించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను పాటించాలని సూచించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామ్మోహన్, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ఎన్నికల నియమావళిపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు కఠినంగా అమలు పరుస్తామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఎలాంటి విద్వేషాలకు తావివ్వకుండా వ్యవహరించాలని సీఐ సూచించారు. ఏఎస్సై కిషన్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి ,బాల్ రెడ్డి, గౌస్, లింగాగౌడ్ కృష్ణహరి, తిరుపతి, నర్సింలు, మురళీమోహన్, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.